# అమూల్యం

–కె. కె. రఘునందన

ఎన్నో సంవత్సరాల తర్వాత తన సొంతూరిలో కాలు మోపాడు యోగానందం. చెప్పలేని సంతృప్తి నెలకొన్నది.

ఒకనాటి పల్లె సొబగులు.. భిన్న స్వరాలను ఆల పించి కొత్త పోకడలకు దారితీశాయి.

ముఖ్యంగా ఆ పల్లెలో పుట్టి.. అక్కడే చదివి.. ఆ ఊళ్ళోనే ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైరవటం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తారీనాటికీ.

పిల్లలు పెరిగి, వారి వారి ఉద్యోగాల్లో స్థిరపడి నపుడు పరిస్థితులకు రాజీపడి తన స్వగ్రామాన్ని వీడలేక వీడలేక వీడారు. ఆ దురవస్థను గత కొన్ని సంవత్స రాలు అనుభవిస్తున్నారు. ఆ స్థితిలోనే.. ఓ నిర్ణయం.. తన జీవనయాత్రలో చివరి భాగాన్ని తన పల్లెలో ముగించాలని.. అందుకే ఈ ప్రయాణం.

చేతి కర్ర సాయంతో ముందుకు నడుస్తుంటే తెలిసినవాళ్ళు పలకరించసాగారు.

తన ఇంటి పరిసరాలలోకి దృష్టినిలిపారు యోగా నందం. అంతే ఆయన గుండెలొకపరి తీవ్ర స్పందనకు గురయ్యాయి.

ఒకప్పుడు నిండు కుటుంబంతో కళకళలాడుతూ.. ఆ ఊరికే శోభాయమానమైన పెంకుటిల్లు..ముఖ్యంగా వీధిలో అరుగు, ఆ అరుగుమీద కూర్చునే పెద్దలు.. అల్లరి చిల్లరగా ఆటలాడే పిల్లలు.. అందరికీ ఆట విడుపుగా నిలిచిన ఆ అరుగు.. ఈనాడు శిథిలావస్థకు చేరింది.. తుది ఊపిరి విడవడానికి సిద్ధపడ్డ రోగిలా నీరుగారిపోతూ..

ఒక్కసారి నిస్త్రాణకు గురయ్యాడు. కళ్ళు గిర్రున తిరిగాయి. అలాగే కుప్పకూలిపోయాడు యోగా నందం.

○ ○ ○

స్పృహలోకి వచ్చేసరికి తను ఓ మంచం మీద ఉన్న సంగతి తెలిసింది యోగానందానికి. ఆయన మంచం చుట్టూ మనుషులు.. వారి వదనాల్లో కాంతి.. పెదాలపై చిరునవ్వులు. అందరినీ ఒకసారి పరిశీల నగా చూసి నమస్కరించాడు.

"బాబుగారూ! నేను గంగునాయుడ్ని.. తమరితో చిన్నతనమంతా గడిపాను.. గుర్తుందా.." తనకి గుర్తుకు తెస్తూ అడిగాడు.

"ఔనౌను.. నువ్వు ఓబులేసుగారి గంగువి కదూ.. నన్ను 'తమరు' ఏంట్రా ఒరే అన్లేవూ..!! మరి నీ పక్క నున్నది సదాశివమే కదూ..! ఒకసారి నువ్వు, నేను బిళ్ళంగోడు ఆడ్తుంటే గుండమ్మగారి కుండకి కన్నం పడితే.. ఆవిడ చీపురుకట్టతో వెంటపడితే దివాణం వెనుక తోటల్లోకి పారిపోలేదూ..!" ఓ దృశ్యం చెప్పి నవ్వాడు యోగానందం.

"ఒరే! నీకంతా గుర్తేన్రా.. కాని మాకొకటే బాధరా.. మీరంతా ఈ ఊరొదిలి పోయాక ఆ వైభవమే కను మరుగయింది. కళకళలాడే వీధి బోసిపోయింది. కొత్త మనుషులు.. కొత్త పద్ధతులూను.. మీ ఇంటిని చూసిన ప్పుడల్లా చాలా బాధనిపిస్తుంది. నాన్నగారుండే రోజులు గుర్తుకొస్తున్నాయి" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు సదాశివం.

అందరి మాటలు విని మెల్లగా కర్ర సాయంతో లేచాడు యోగానందం.

"మీరంతా నా ఇంటి బాగోగులు గురించి చెబు తున్నప్పుడే నా మీద మీకెంత అభిమానం ఉందో తెలు స్తోంది.. నేనొచ్చింది అందుకేనయ్యా.. నా ఊరు.. నా వాళ్ళు.. నా ఇల్లు.. అనే మమకారంతోనే.. నా కొడుకులకు దూరంగా ఇలా వచ్చేశాను. నాకీ గాలి.. నీరు తగిలితే చాలు నూరేళ్ళూ హాయిగా బ్రతికేస్తాను. మీలాటి మనుషులు మాట్లాడే మాటలే నాకు తేనె ఊటలౌతాయి."

ఆయన మాటలతో అందరి ముఖాలు తేట పడ్డాయి.

"బాబూ! మళ్ళీ మీ ఇల్లు బాగాలేవాలయ్యా! అందరం కలిసి ఆ వీధరుగు మీద కూర్చోవాలి.. పిల్ల లంతా అల్లరిగా ఆటలాడాలి! సంతోషంగా అన్నాడు సాయిరాం మాస్టారు.

"ఎక్కడో ఉండి సుఖాలనుభవించే అవకాశం పుష్కలంగా ఉన్నా మమకారంతో ఈ ఊరు రావటం నిజంగా గొప్ప విషయమే" పొగిడాడు శిఖామణి.

వారందరి మాటలు మంచి ఉత్తేజాన్ని ఇచ్చాయి యోగానందానికి. ఉన్న ఊరు, కన్న తల్లి అని ఊరికే అనలేదు.. సాక్షాత్తూ అమృతమే ఆస్వాదించినా లభ్యం

కాని తృప్తి.. స్వర్గతుల్యమైన తన ఊరిలో.. తన ఇంట్లో లభ్యమౌతుంది.

ఇదే భావన యోగానందాన్ని ప్రేరేపించింది.

ఆయన రాక ఊర్లో అందరికీ తెలిసింది. శిథిలావస్థలో నున్న ఆయన పెంకుటిల్లు బాగుపడుతోంది.. ఇది అందరికీ ఆనందాన్నిచ్చింది.

యోగానందం ఇల్లు బాగయ్యేవరకూ ప్రియ మిత్రుడు శిఖామణి తన ఇంట్లో ఆశ్రయమిచ్చాడు.

మర్నాడు మేస్త్రీలను పిలిపించాడు.

మొత్తం ఇల్లంతా నేలమట్టం చేసే ప్రతిపాదన యోగానందానికి ఏమాత్రం రుచించలేదు.

ఆ పెంకుటిల్లు తన తండ్రి ప్రణాళికాబద్ధంగా కట్టించినది. అదాయన ప్రతిరూపంగా భావిస్తున్నాడు.. ఏమాత్రం చెక్కుచెదరకూడదు..

తూర్పు సందు నుండి వీచేగాలి.. ఈశాన్య మూల దేవుడి పూజకై ప్రత్యేక ఏర్పాటు.. ఎవరికి వారుగా మసలడానికి వేరు వేరు గదులు.. వెన్నెల పారాడేలా ఇంటి నాలుగువైపుల నుంచీ మధ్యగా వదిలిన పందిరి..

పెరట్లో మొక్కలకై వేరుగా ఉంచిన జాగా.. ముఖ్యంగా వీథిలో పెద్ద అరుగు.. అన్నిటికంటే అది పూర్తిగా పాడయిపోవడం యోగానందాన్ని కలుక్కుమనిపించింది.

ఈ పరిస్థితిలో ఇల్లు కదిపితే కందిరీగల తుట్టే!.. పెంకంతా పోయింది.. కలప పుచ్చిపోయింది. గోడలు తప్ప ఏవీ పనికివచ్చేలా లేవు.

ఆ పాత ఇంటినే తిరిగి అలాగే కట్టడానికి సిద్ధపడుతున్న యోగానందాన్ని వెర్రివాడిలా చూశారు. కనీసం రైల్వే పెంకయినా వేయమన్నారు. కాని, దోనె పెంకయితేనే బాగుంటుందని పట్టుబట్టాడు.

ఈ రోజుల్లో దోనె పెంకు తయారీ లేదన్నారు. అయినా కాళ్ళరిగేలా తిరిగాడు. నెల్లిమర్లలో ఎవరో పాత ఇంటి పెంకు దిబ్బలుగా పెట్టి ఉంచినట్లు తెలిసి వెళ్ళి బేరంచేసి తెచ్చాడు.

మొత్తం మరమ్మతుల అంచనా ఏభై వేలు దాటింది.

యోగానందానికి మిత్రుడు శిఖామణి చేదోడు వాదోడుగా నిలిచాడు. అనతికాలంలోనే ఇల్లు తయారయింది.

పెరట్లో ఉండే బాదంచెట్టు, వీథి అరుగుకు ఆనుకుని ఉండే పొగడచెట్టు ఎండి మోడుగా మారటం చూసి, ఆ మొక్కలు తెప్పించి మళ్ళీ నాటాడు. అవి చిగుళ్ళు తొడిగేదాకా శ్రద్ధగా నీళ్ళు పోశాడు. ఆ మొక్కలు ఎదిగి చెట్లయితే ఎన్నో పక్షులకు ఆశ్రయం ఇచ్చినట్లవుతుందని భావన.

యోగానందం చేతలు పదుగురి ప్రశంసలకు నోచుకున్నాయి.

వీథి అరుగుకి ఆనుకుని ఉన్న గోడకి ఎత్తుగా నల్లబల్ల చేయిస్తుంటే విస్తుబోయి అడిగాడు శిఖామణి.

"ఏరా యోగీ! నీకేమైనా పిచ్చా! ఇదేమైనా ఆఫీసా..? నోటీసులంటించడానికి.. ఇదెందుకురా ఇక్కడ?"

"చదువు చెప్పటానికిరా..!"

"ఈ వయసులో నీకెందుకురా ఈ వ్యాపకం..!!"

## బొంగరాలు

**బొం**గరాలు
బొంగరాలు
రంగు రంగు
బొంగరాలు

జాలచుట్టి
ఝుళిపిస్తే
గాలిలోను
గిరాగిరా
చేతిలోను
గిరాగిరా
నేల మీద
గిరాగిరా
తిరిగి తిరిగి
సాగి ఆగు

బల్లెం మొన బొంగరం
బాడిసె మొన బొంగరం
మొనదేలిన బొంగరాలు
మొనగాళ్ల బొంగరాలు

బాలచంద్రుడి బొంగరం
జాల మీదనే తిరుగుతుంది
జాల చుట్టి వేటు వేస్తే
ఎదుటి వాడి బొంగరం
రెండు ముక్కలౌతుంది.

**-జె. కొండన్న**

వింతగా అడిగాడు శిఖామణి.

"ఒరే నలుగురికి పంచిన కొలదీ పరిమళించేది విద్య ఒక్కటేరా..! మనిషి ఎప్పుడూ చదవాలి.. నలుగురికీ చెప్పాలి. డబ్బు పంచినా చెప్పుకోని మనిషి చదువు చెపితే పదికాలాలపాటు చెప్పకుంటాడు" అని యోగానందం చెపుతుంతే శిఖామణి తెల్లబోయాడు.

వీధిలో వరండా.. అరుగు తప్ప అన్ని పనులు అయిపోయాయి.

○ ○ ○

యోగానందం ఇంటి ముందు ఓ కారాగింది. అందులోంచి ఓ కుర్రాడు దిగాడు.

"యోగానందంగారిల్లు..." సంశయంగా అడిగాడు.

"ఇల్లు ఇదే.. కాని, ఆయన దివాణం దగ్గరున్న శిఖామణి గారింట్లో ఉంటున్నారు.." అని కుర్రాడు చెప్పగానే కారును ముందుకు పోనిచ్చాడు.

"మీరు..." కారు దిగి లోనికి గబగబ వస్తున్న కుర్రాడిని, ఓ అమ్మాయిని చూసి అడిగాడు శిఖామణి.

"యోగానందంగారు.." తనెవరో చెప్పకుండా తిరిగి ప్రశ్నించాడు కుర్రాడు.

"ఉన్నారు.. మీరెవరో చెబితే.."

"తప్ప లోనికి రానివ్వరా..! ఇంతకీ ఆయన గారెక్కడ?" కంఠంలో కరుకుతనం బహిర్గతమైంది.

ఈ సంభాషణ వినటంతోనే లోపలనుండి ఆదుర్దాగా వచ్చాడు యోగానందం.

"ఒరే.. నువ్వు.. నీ భార్య ఏమిట్రా ఇలా వచ్చే సారు.." గొంతు కంపించింది యోగానందానికి.

"వీళ్ళని చూస్తే ఎందుకురా అలాగైపోయావు! ఇంతకీ వీళ్ళెవర్రా.." అయోమయంగా చూస్తూ అడిగాడు శిఖామణి.

"జవాబు చెప్పాల్సింది ఆయన కాదు.. నేను.. ఈ యోగానందం గారి అబ్బాయి నరసింహాన్ని నేను.. ఈమె నా భార్య సుప్రజ.. ఇరవై రోజుల నుంచి నాన్నగారి జాడ తెలియలేదు. తమ్ముడి దగ్గర కెళ్ళారేమోనని ఫోన్ చేశాను. అక్కడా లేరనగానే వారం దరినీ వాకబు చేశాం. చివరికి స్వగ్రామం వెళ్ళారేమో నన్న అనుమానంతో ఇలా వచ్చాం. నాన్నగారూ! ఏమిటి మీ ధోరణి? ఏనాడో రిటైరైన మీరు మాతో హాయిగా ఉంటూ గడపవచ్చు కదా! మీకీ ఊరితో ఏం పని? చెప్పండి" నిలదీశాడు నరసింహం.

మూగనోము పట్టాడు యోగానందం.

## ఏకాంత సమూహాలు

నేను, నా ఏకాంత శూన్య గోళంలో
ఒంటరిగా నా కోసం నేనై
నా చుట్టూ పరచుకొన్న రంగుల ప్రవాహాలకు
పరవశించిపోతూ
చుట్టూ ఆవరించిన సబ్బు బుడగని పరికిస్తూ
ముచ్చటగా మురిసిపోయాను
పులకరించిపోతూ పాటందుకొన్నాను
నా పాట నా చెవిని తాకలేదు
నివ్వెరపోతూ
నా నోటి పాట తరంగాలు నా చెవినే తాకనివ్వని
చుట్టూ ఆవరించిన శూన్యాన్ని
ఛిద్రం చేయలేని నా చేతులు
అసహాయంగా మిగిలిపోయాయి
నేనిప్పుడు
నా ఏకాంత శూన్యగోళంలో ఒంటరిగా
గడియారం ముల్లుని మోసుకుపోతూ
ఉరుకులు పరుగులతో
చుట్టూ జనప్రవాహాలు
వెనవెనకే నడిచే నీడనైనా
గమనించే సమయం మిగుల్చుకోకుండా
ప్రవహిస్తూనే ఉన్నారు
నా పెదాల కంపనం వాళ్ళ చూపుని తాకేదెలా
నేను నా ఏకాంత శూన్యగోళంలో ఒంటరిగా
శూన్యాన్ని ఛేంచేసే ఏ చిన్న కీటకమైనా
నా ఆవరణలోకి అడుగుపెడుతుందేమోనని
చుట్టూ వెతుక్కుంటాను
నా అంత అవివేకంగా శూన్యాన్ని
మనసు చుట్టూ అల్లుకొనేదెవరు
చుట్టూ మిత్రుల్ని కోల్పోతున్నదాన్ని
నాకు నేనే శత్రువునైపోతున్నానా
నేనిక / నా ఏకాంత శూన్య గోళంలో
బిగుసుకొన్న శిల్పాన్నై - ఒంటరిగానేనా
నేనూ.. నువ్వూ... మనమందరం... / ఇంతేనా?

–శీలా సుభద్రాదేవి

"మీరింత హడావుడిగా దిగి ప్రశ్నల వర్షం కురిపిస్తే తట్టుకోలేకపోతున్నారు.. రండి.. మాతో పదండి.. ఆయన ఈ ఊరొచ్చింది ఎందుకో చెబుతాను.." అని యోగానందం గారిని నడిపించుకుంటూ ముందుకు దారితీశాడు శిఖామణి.

"చూడవయ్యా! నరసింహం.. ఒకప్పుడు మీ అందరినీ ఈ ఇంట్లోనే ప్రేమగా పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి, తల్లిలేని లోటును తెలీకుండా చేశారయ్యా. ఏ ఇల్లయితే తన స్వర్గమని నమ్మారో, ఆ ఇంటిని కూడా మీ సౌలభ్యం కోసం విడిచిపెట్టి మీతో నిర్బంధంగా కాంక్రీటు అరణ్యంలోకి వచ్చేశారు. పాత రుచిని మరిగిన జిహ్వ కొత్త రుచిని అంగీకరించని విధంగా ఆయన తన చివరి కాలంలో తనూరొచ్చారు. ఇంటిని బాగుచేసుకుంటున్నారు" అన్నాడు శిఖామణి.

. "బీరువాలో పెట్టిన యాభైవేలతో ఈయన కూడా కనిపించకపోతే ఎంత గాబరాపడ్డామో! ఈ బొక్కి కొంప మీద ధారపోయడానికి ఎలా మనసొప్పిందని..? గోడక్కొట్టిన సున్నంలా వెనక్కి రాదా సొమ్ము.. ఈ కొంప ఎవరికో ఒకరికి అమ్మేస్తే పోతుంది.." విసుగ్గా అన్నాడు నరసింహం.

అప్పటిగ్గాని నోరు పెగల్చలేదు యోగానందం.

"ఔన్రా! నువ్వు సంపాదించిన ఆస్తయితే అలాగే చేసేవాడివి. ఇది మా నాన్నగారు పౌరోహిత్యంతో కూడబెట్టి కట్టించుకున్న ఇల్లు. ఉండటానికి తప్ప అమ్మటానికి ఎవరికీ హక్కు లేదు".

"హఠాత్తుగా మీరెళ్ళిపోతే మేం మిమ్మల్ని ఏదో అనబట్టే మీరలా వెళ్ళిపోయారని బంధువులంతా కోడై కూశారు. తలెత్తుకోలేకపోయాం. పోనీ చెప్పొచ్చు కదా..!" అంది సుప్రజ.

"చెపితే ఆ మహారణ్యంలోంచి నన్ను రానిస్తా రామ్మా! అందుకే నేను వచ్చేశా.." స్థిరంగా అన్నాడు యోగానందం.

తండ్రి చేస్తున్న పని సుతరామూ నచ్చలేదు నరసింహానికి. ఎక్కడో ఉన్నతమైన ఉద్యోగాల్లో తాముంటే ఈ వయసులో ఒంటరిగా వచ్చేసి ఈ సాధింపేమిటోనని తెగ నలిగిపోయారు.

"పోనీ ఇప్పటికి అయిందేదో అయింది. ఇంతటితో పని ఆపేయండి" అన్న కొడుకు మాట శూలంలా గుచ్చుకుంది యోగానందానికి.

"కొద్దిగా ఉండిపోయింది.. వీథిలో వరండా.. అరుగు మాత్రమే.." ప్రాధేయంగా అన్నారాయన.

"వద్దు..!! ఇప్పటికే బోలెడు తగలెట్టారు.." చికాగ్గా అన్నాడు.

"పోనీ.. ఒక్క అరుగు.."

"అది కూడా దండగ.. అయినా దేనికది?.." కటువుగా అడిగాడు నరసింహం.

"అరుగెందుకంటావేంట్రా? నలుగురూ కూచోవటానికి.."

"ఎందుకూ కూచోవటం...! అయినా ఎవరో కూచుంటారని మీరెందుకు కట్టించటం?" నవ్వుతూ అన్నాడు నరసింహం.

"ఒరే నీకెలా చెప్పాలో అర్థం కావటంలేదురా. అరుగుల శోభను నీకు ఏమని చెప్పను? ఇదే అరుగు మీద నువ్వూ ఆడుకున్నావు. మీ తాతగారి ఒడిలో కూర్చుని కథలు విన్నది ఈ అరుగుమీదనేరా.. ఊర్లో పెద్దలంతా సాయం వేళల్లో ఈ అరుగు మీద చేరి ఆప్యాయంగా కబుర్లాడుకుంటే ఆ హాయి వేరురా.." పులకించిపోతూ చెప్పాడు యోగానందం.

ఊరుకోకుండా నరసింహం తగువులాడాడు.

వారిరువురి వాదన శిఖామణికి చికాకనిపించింది. తండ్రీ కొడుకుల అనుబంధం, ఆప్యాయతానురాగాలతో విలసిల్లాలి తప్ప తగువులు, తంటాల మధ్య కొట్లాడకూడదనిపించింది.

"బాబూ.. నరసింహం! మీ నాన్నగారి కోరికను

## నిజాయితీ!

ఏర్చి ఏర్చి
పేర్చి పేర్చి
గుమ్మం గుమ్మం
తిరిగి వేసారి
శుభం కార్డులు
పంచేశాడు పోస్టుమేన్!
అతనికి పాపం
ఒక్క గ్రీటింగూ రాలేదు...
అలా అని అతను
అందమైన కార్డు దాచేయలేదు
అందుకే అందరితోబాటు
పోస్టుమేన్‌కూ
నూతన వత్సర
శుభాకాంక్షలు!!

**-జి.జి.కె.రావు**

కాదనకు. ఆ అరుగు ఒక్కటే బాగు చేయించనీ.. సరేనా.. ఈ రోజు మీరుండండి.. మాట్లాడుదాం.." కల్పించుకుని సయోధ్య చేశాడు శిఖామణి.

"ఔను నేనూ మీతో మాట్లాడాలి.." అన్నాడు నరసింహం.

ఆ రాత్రి యోగానందం మనస్సు వేయి విధాలుగా ఘూర్ణిల్లసాగింది.

నరసింహం, సుప్రజ శిఖామణితో మొత్తం చర్చించారు.

శిఖామణి తీవ్ర యోచనలో కొట్టుకులాడాడు.

"ఔనండీ! మామగారి గురించి మేం తీవ్రంగా ఆందోళన పడుతున్నాం. ఆయన విషయం మీకెలా చెప్పాలోనని మాకూ భయంగా అనిపించింది. దయచేసి మీరు సహకరించాలి" అంది సుప్రజ.

"అరుగు కట్టించడానికి అడ్డుచెప్పం. కానీ మా పరిస్థితి! తమ్ముడు ప్రభుకి సెలవుల్లేక రాలేకపోయాడు గాని, వాడి మనసూ గింజుకుంటోంది.." సూటిగా చూశాడు నరసింహం.

శిఖామణి సాలోచనగా తల పంకించాడు.

"మేం విజయనగరంలో పనిమీద వెళ్ళి రెండు రోజుల్లో తిరిగి వస్తాం.. ఈ లోగా మీరు.." వేడుకుంటున్నట్లుగా అన్నాడు నరసింహం.

"సరే! నేనేదోలాగ నచ్చచెబుతాలెండి" అంగీకరించాడు శిఖామణి.

○ ○ ○

"ఒరే.. ఇంటి పని పూర్తయింది.. నువ్వింక మీ అబ్బాయితో వెళ్ళిపోతావా..?" శిఖామణి అడిగిన ప్రశ్న చిత్రాతి చిత్రంగా అనిపించింది యోగానందానికి.

"అదేంట్రా.. నేను.. ఇల్లు కట్టుకున్నది ఉండటానికి గాని.. వెళ్ళిపోవటానికి కాదు.." ఆశ్చర్యం, ఆవేదన యోగానందాన్ని చుట్టేశాయి.

"ఔననుకో గాని.. నీ గురించి మా కంటే మీ అబ్బాయి, కోడలుకే బాగా తెలుసు. వారి ప్రకారం నడుచుకోవటం ముఖ్యం.." నిర్దుష్టంగా చెప్పాడు శిఖామణి.

"నీవలా అనటం దారుణంరా! ఊర్లోకి రాగానే ఆదరించావు. కాని ఈ రోజు మా అబ్బాయి, కోడలు రావటంతో వారి మాటలకు వత్తాసు పలికి నన్నే వెళ్ళిపొమ్మంటున్నావు. నీకేమైందిరా.." నిలదీశాడు యోగానందం.

మౌనం దాల్చాడు శిఖామణి.

అక్కడున్న సదాశివం, సాయిరాం మేస్టారు, గంగునాయుడు కూడా శిఖామణి చెప్పిందే సరియైనదన్నారు.

"ఒరే! మీరంతా కూడా నన్ను వెళ్ళగొడదామని చూస్తున్నారా? చాలా బాగుందిరా.." గగ్గోలు పెట్టాడు యోగానందం.

నరసింహం చెప్పిన కోణంలోంచి చూస్తే అది అక్షరాలా నిజం. యోగానందం ఆశయం ఉన్నతమైనదే కావచ్చుగాని వారికి అది సాహసోపేత నిర్ణయంగా

## ఎలిఫెంటా గుహలు

గుహల నిండా ఊదారంగుతో
శతాబ్దాల.నిశ్శబ్దం
కాలం నోటితో మాట్లాడదు.
అరేబియా సముద్రంలో
రాలిన మట్టి చుక్క ఎలిఫెంటా.
ద్వీపం కుచ్చిళ్లను
అలలు మెలిపెడుతుంటే
వాత్సల్యంగా చూసే అమ్మలా ఎలిఫెంటా.

గేట్ వే ఆఫ్ ఇండియా
దర్పాన్ని తప్పించుకోవాలంటే
ఎలిఫెంటాయే శరణ్యం.
దొరల దోపిడీకి తెరుచుకున్న ద్వారం
ఎప్పటికీ మూసుకోదు.
తాజ్‌మహల్ హోటల్‌లో
బస అక్కర్లేదు నాకు.
ఈ బండల మీద పడుకొని
ఆదిమ కెరటాలను వింటాను.

చుట్టూ ఎన్నెన్ని ఓడలో!
అవి నీళ్లలో ఈదితే
ఇది కాలం కడలిలో.
ఓ గుహలో ప్రవేశించి
అక్కడే ఉండిపోతే!?
ఇంతకూ ఏనుగు కనపడదేమి
నా మనసులోకి దూరిందేమో!

*(ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి సముద్రంలో పది మైళ్ల దూరంలో ఓ చిన్న ద్వీపంలో ఎలిఫెంటా గుహల్లోని శైవ శిల్పాలను చూడటం ఓ అనుభూతి!)*

–డా॥ ఎన్.గోపి

అనిపించింది.

మిత్రులంతా ఒకే మాటమీద కట్టుబడి ఉండటం యోగానందాన్ని నిరాశా నిస్పృహలకు గురిచేశాయి.

ఆకస్మికంగా మారిన మిత్రుల మనస్తత్వాలు మింగుడుపడక అశాంతితో నలిగిపోయాడు యోగానందం.

"ఒరే శిఖా, మీరంతా మా వాడితో చేతులు కలిపి నన్ను పంపేద్దామనుకుంటున్నారు కదూ! పోనీలెండి

## మరోచోట

నిన్న ఎండలో
తవ్వడం మొదలుపెట్టారు
వాళ్ళకు
సూర్యుడు దొరికి వుంటాడు
ఈ రోజు వర్షంలో
పైపులు వేస్తున్నారు
వాళ్ళకు
నది నమస్కరించి వుంటుంది
ఎప్పట్నించో
ఒక సోమరోడు
సినిమా పోస్టర్
చూస్తూ నిలబడ్డాడు
వాడు
సినిమా యాక్టరయినట్టూ
హీరోయిన్‌తో
స్విడ్జర్‌లాండ్‌లో
డ్యూయెట్టు పాడుతున్నట్టూ
బంజారాహిల్స్‌లో
కొత్త బంగళా కట్టుకొన్నట్టూ
కలగంటూ మురిసిపోతున్నాడు
కాలాలు గడిచిపోతున్నాయి
సోమరోడు
అక్కడే నిలబడి వున్నాడు
సోమరోడి కొడుకు వచ్చి
పోస్టర్‌కి దండ వేస్తున్నాడు
వాళ్ళు మాత్రం
మరో చోట
మరో ఉదయాన్ని తవ్వుతూ
మరో సముద్రాన్ని మలుపుతున్నారు

—ఆశారాజు

నేనీ ఊరికి, నా ఇంటికి దూరంగా పోవాలనేగా మీరంతా కోరుకుంటున్నది.. ఒరే నేనెళ్ళిపోయినా.. నేను కట్టించిన అరుగు మీద కూర్చోండిరా.. మరచిపోకండీ.. సాయం వేళల్లో మా అరుగు మీలాటి పెద్దలతో కళకళలాడిపోవాలి. తెలుసా!" కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు యోగానందం.

ఆయన వెత వారందరికీ అవగతమే! కానీ ఎటూ చెప్పలేని నిస్సహాయ స్థితి.

అదే సమయంలో కొడుకు, కోడలు కనిపించక పోవడంతో వారి గురించి ఆరా తీశాడు.

ఆ రాత్రి యోగానందం– "ఒరే శిఖా!.. మీ అందరి మాటమీద నేను మనసు చంపుకుంటూనే నా కొడుకుతో వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాను. కానీ నాదో కోరిక.. పూర్తిగా నా ఇంట్లో గడిపే యోగం నాకెలాగూ లేదు.. కనీసం ఒక రోజయినా గడపాలని ఉందిరా.. ఈ చిన్న కోరిక తీర్చు.." అని బ్రతిమిలాడాడు.

అతని కోరికను కాదనలేకపోయాడు శిఖామణి. అయితే ఆ కొత్త ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడానికి ఇష్టపడలేదు. తను కూడా తోడుంటానన్నాడు.

భోజనాలు చేశాక కొత్త ఇంటికి వెళ్ళారు.

పందిరిలో రెండు పట్టెమంచాలు ఏర్పాటు చేశాడు శిఖామణి. నాలుగు వైపుల నుండీ పందిట్లో పడ్డ పాల వెన్నెల తళుక్కుమంటూ చలువతనాన్ని పంచుతోంది.

ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో యోగానందం ఎన్నెన్నో సంగతులు.. ముఖ్యంగా బాల్యం నుంచి నిన్న మొన్నటి దాకా జరిగినవి ముచ్చటించాడు. ఆనక నిద్రలోకి జారుకున్నారు.

తెల్లవారు ఝామున తన మీద పడ్డ చేయి లాగుతున్నట్లుగా అయి తెలివి వచ్చి దిగ్గున లేచాడు శిఖామణి.

యోగానందం ఒగరుస్తున్నాడు. శిఖామణిని ఏవేవో అడిగాడు. నిజం చెప్పమంటూ ఒత్తిడి చేశాడు. తప్పనిసరి పరిస్థితిలో చెప్పాడు శిఖామణి.

దానికి జవాబుగా– యోగానందం చివరిగా బాధపడుతూ చెప్పిన రెండే రెండు విషయాలు శిఖామణిని బాగా కదిలించాయి.

మిత్రుడు చేతుల్లోకి జారిపోయాడు యోగానందం. బోరుమన్నాడు శిఖామణి.

అప్పటికే వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి. వెంటనే శిఖామణి గబగబ వెళ్ళి మిత్రులందరినీ

పిలుచుకువచ్చాడు.

చుట్టుప్రక్కల జనం కూడా చేరారు.

"రండి.. సాయం పడదాం.." నలుగురూ చేయి వేసి వీథిలోకి తీసుకెళ్ళారు.

అప్పుడు అందరి దృష్టి కొత్తగా చేయించిన అరుగు మీద పడింది. దాని మీదనే ఆయన్ను పడుకోబెట్టి బావురుమన్నారంతా..

ఆ దృశ్యం అందరి హృదయాలనూ కదిలించింది.

"ఇంతకీ వచ్చిన కొడుకేదయ్యా!" ఓ పెద్దాయన కేకేశాడు.

"అదిగో ఆ కారులో వచ్చింది.. అతగాడే కాబోలు చూడండి" అని ఎవరో అనగానే అందరి దృష్టి అటు మళ్ళింది.

కారులోంచి నరసింహం, సుప్రజ దిగారు. జనాన్ని చూడ్డంతో గబగబ ముందుకి నడిచారు.

"వచ్చినవాడివి.. ఆ కాసేప్పయినా మీ నాన్న గారితో గడపలేదేమయ్యా! పుట్టిన ఊరిమీద నీకా మాత్రం మమకారం లేదా? ఇంతకీ ఎక్కడికెళ్ళావయ్యా?" ఓ ముసలాయన నిలదీశాడు.

"రిజర్వేషన్‌కి వెళ్ళాను" కలవరపడుతూ అన్నాడు నరసింహం.

"తనే సీటు రిజర్వు చేసుకున్నాడయ్యా ఆ పుణ్యాత్ముడు. ఇంక ఎవరికీ ఏ బాదర బందీ లేదు.." సాయిరాం మేస్టారి గొంతు వణికింది.

"తను ఉండటానికి కట్టుకున్న ఇల్లు పోవటానికి ఉపయోగపడింది. నిన్న తను ఇష్టపడి కట్టించిన అరుగు నేడు తన శవానికి జాగాగా పనికొచ్చింది" నిట్టూరుస్తూ అన్నాడు సదాశివం.

"తన సొంతూరి నుంచి మీ నాన్నగారిని తరిమేయాలని గుండెజబ్బు చుట్టబెడుతోందని, ఈ పల్లెలో ఉంటే ఆస్పత్రి సదుపాయం ఉండదని.. క్షణ క్షణం అప్రమత్తంగా చూసుకోవాలని.. ఆ కారణంగానే తీసుకెళ్ళక తప్పదని గొప్ప అబద్ధం చెప్పావు. కాని.. ఇప్పుడు వచ్చింది మాత్రం ఉత్తి గుండెజబ్బు కాదు.. అసలు సిసలైనది.." కడిగి పారేశాడు శిఖామణి.

ఆ మాటలు నరసింహాన్ని నిలువునా కూలేలా చేశాయి.

"ప్లీజ్ శిఖామణిగారూ! నాన్నగారు మాతో రావాలన్న పట్టుదలకొద్దీ అబద్ధమాడాను" అని భోరున విలపించాడు.

"అదేనయ్యా నువ్వు చేసిన పొరపాటు.. దానివల్ల చివరి క్షణాల్లో మా మిత్రులందరం ఆయన దృష్టిలో చెడ్డయ్యాం.." బాధగా అన్నాడు సదాశివం.

"చూడు నరసింహం! మీ నాన్నగారు.. తను కోల్పోయిన అనుభూతులను తిరిగి కావాలనుకుని వచ్చారయ్యా! తన ఊరు.. తను ఎరిగిన మనుషులు.. తన ఇల్లు.. ఇవే ఆయన మనసులో నాటుకున్నాయి. అందుకే ఇల్లు బాగుచేసుకున్నారు. పాడయిన అరుగును బాగుచేయించి కొత్త కళ తెచ్చారు. అంతేకాదు గోడ మీద నల్లబల్ల తయారు చేయించారు. అదెందుకంటే పదుగురికి విద్యాబుద్ధులు చెప్పటానికి అన్నారు. పక్షుల ఆశ్రయం కోసం చెట్లుండాలన్నారు. ఇదంతా ఎవరి కోసం.. తన ఒక్కడి స్వార్థం కోసం కాదు. నిజం చెప్పు.. మీరు నివసిస్తున్న కాంక్రీటు మహారణ్యాల్లో ఓ ఇల్లు అన్న అనుభూతి ఉంటుందా? నలుగురి పలకరింపులు.. ఆప్యాయతలు.. కలిసి కబుర్లు చెప్పుకోవడాలు.. ఇవేవీ కనిపించవు.. ఆ బిజీ వాతావరణంలో మగ్గిపోయి, విసిగిపోయి కాస్త హాయిగా ఊపిరి పీల్చుకోవాలని.. చివరి జీవితం ప్రశాంతంగా గడపాలని ఇలా వచ్చారయ్యా. అటువంటి మంచి మనిషిని నీతో పాటుగా ఈడ్చుకుపోయి మళ్ళా ఆ అపార్ట్‌మెంట్ నాలుగ్గోడల నడుమ బంధించటం కోసం ఓ గుండె జబ్బును సృష్టించావు. అది ఎంత దారుణమయ్యా! ఆయనకు నీ వైఖరి తెలిశాకనే నిజమైన గుండెజబ్బు వచ్చింది. వృద్ధాప్యంలో ఉన్న వారి ఆశయాలకు కూడా విలువనియ్యాలయ్యా! రేపు.. నీకు.. నాకు.. అందరికీ అది తప్పదు.. ఆ పరమ సత్యం గ్రహిస్తే చాలు.." ఏకధాటిగా మాట్లాడాడు శిఖామణి.

ఆ సరికే ఊరు-వాడా తరలి వచ్చింది పొంగిన గంగల్లే. వారందరి రాకలోనే పల్లె తల్లి ఎటువంటిదో సాక్షాత్కరించింది.

తన ఊరు అంటూ పరుగులెట్టి, తన చివరి జీవితం అక్కడే గడపాలని తండ్రి ఎందుకు అంతగా పాకులాడిందీ కూలంకషంగా అవగాహనకొచ్చింది నరసింహానికి.

తమలాటి వారెందరో మెగాసిటీల్లో ఉండి పెద్ద ఉద్యోగాలు చేస్తూ సంపాదించేది ధనమైతే.. తన తండ్రి యోగానందం మామూలు మేస్టారిగా సంపాదించినది అభిమాన ధనం..

అది ఎంతో అమూల్యం.. ఎవరూ కాదనని నిత్యసత్యం! ■